# సంకల్ప సిద్ధుడు

★

శ్రీపంతుల శ్రీరామశాస్త్రి

శంకర శాస్తుల్లుగారిని తెలిసిన వాళ్ళంతా ఆయన గురించి చిత్రంగా మాట్లాడుతారు. 'ఆయనకేమిటయ్యా, లక్షాధికారి, బైటికి అలావుండగానేసరా?' అని కొందరూ, 'లక్షాధికారే, అయితే ఎక్కణ్ణించి వచ్చిందిదంతా? వడ్డీలకు వడ్డీలు పెంచి తాకట్లు వాకట్లు చేసేసుకొని సంపాదించినదేకదూ?' అని కొందరూ, "సంకల్ప సిద్ధుడంటే ఆయనేనండీ, చిన్నతనంలో ఒక మారు తనలో తాను నిశ్చయం చేసుకొన్నాడు. తనచేతిమీదుగా ఒక లకారం పైగా సంపాదించాలని, అంతే అంతవరకూ మనిషి పట్టిన పట్టు విడవలేదు—" "నిజమే, సంపాదించాడయ్యా, కాని ఏం ఫలితం? దమ్మిడీ దానం ధర్మం అని లేదు కదా, ఎంగిలి చేత్తో కాకినయినా కొట్టడే, వట్టి నిర్గంధ కుసుమం" అని కొందరూ ఇలా బైటికి స్పష్టంగా అనకపోయినా, లోపల్లోపల శంకరశాస్తుల్లంటే ఏదో ఈర్ష్య ఉన్నట్టే మాట్లాడుతారు.

ఇందుకు కారణమేమిటా అని ఆలోచిస్తే ప్రధానంగా ఒక్కటే కనిపిస్తుంది. శంకర శాస్తుల్లు ఒంటరి మనిషి. కొడుకులూ కూతుళ్ళూ కాదు, తదితర సమీప బంధువులు కూడా లేని మనిషి. అతనికి కాస్త డబ్బు చేకూరిన తరవాత, దూరపు బంధువులు కొందరు అతనితోడి తమ బాంధవ్యాన్ని పునరుద్ధరింప తలచుకొని హతాశులయేరు. ఇక, ఇటువంటి ఇరస్తా పరస్తాకాని, శంకరశాస్తుల్లు దగ్గర లక్ష రూపాయలుండడమా? అదీ, ఏదో పిత్రీయ మయిన ఆస్తిగాని, ఏలాటరీలోనో హఠాత్తుగా అప్రయత్నంగా వచ్చినటువంటిది కాక, కేవలం స్వార్జితమని ఒక్కొక్క రూపాయ చొప్పున పెంచిన ఆస్తా? ఇక ఈర్ష్యకేంలోటు? తానేం బాగా చదువుకొన్నవాడా? మొదట కొన్నాళ్ళు సంస్కృతం చదివి, తరవాత ఇంగ్లీషు ఆరంభించి, నాలుగున్నర అంటే ఇప్పటి మూడవ ఫారముతో చదువు చాలించినవాడు. పోనీ అలాగని చదువుకోకపోయినా సహజమయిన మేధా సంపద విపరీతంగా కలవాడేమో అంటే అదీ లేదు. ఇన్ని సంవత్సరాలుగా కడుతున్న వడ్డీ లెక్కలు ఈ సరికి మరొకరికయితే కంఠతః రావలసింది, అయిదు వందలకీ వెయ్యికీ ఆర్నెల్లకి వడ్డీ కట్టడానికి కూడా అరగంటసేపు పలక మీద లెక్క చేస్తాడు. ఒకమారు వచ్చిన మొత్తాన్ని కాగితంమీద వేసుకొని దాన్ని చూడకుండా మళ్ళీ పలక మీద చేసి రెండు మొత్తాలూ సరిపోతే అప్పుడు తృప్తిపడేవాడు. రెండు మార్లూ ఒకే రకం తప్పు చేసి ఉండవచ్చుననే అనుమానం ఆయనకు కలగదు.

అవలీలగా ఎంతెంతలేసి లెక్కలూ నోటిసే చేయగలిగిన వాళ్ళు, అనర్గళంగా గంటల తరబడిని ఉపన్యసించ గలిగిన వాళ్ళూ, అమూల్యమయిన పథకాలు వేయగలిగినవాళ్ళు, అతిలోక రమణీయమయిన కవిత్వం వ్రాయ గలిగిన వాళ్ళు—ఎందరో మంది తమకు శంకరశాస్తుల్లు యడల కలిగిన ఈర్ష్య చాలా ధర్మ్యమయినదనే నమ్ముకొనేవారు.

నిజం చెప్పవద్దూ, నామటుకు నాకూ ఒకప్పుడలాగే ఉండేది. నాకే లక్ష రూపాయిలుంటేనా, ఎన్నో గొప్ప పనులు చేసే వాణ్ణి. ఏమిటో అనినాకే నిశ్చయం లేదనుకోండి. శంకరశాస్తుల్లుకి అంత డబ్బును ధర్మంగా సంపాదించదగిన తెలివి తేటలు లేవు; ఇక ఉన్న డబ్బును లోకోపకారం నిమిత్తం కాకపోతే మానె అధమం తన ఆనందం కోసం అయినా ఖర్చుపెట్టే చొరవలేదు. గనక, అది కలిగి ఉండడానికి అతనికి అర్హత లేదు. అంతే కాదు, ఈ మాత్రం డబ్బుందికదా, నాకేం ఉచితంగా అక్కర లేదు. ప్రస్తుతం కొంత పెట్టుబడి కింద ఇయ్యకూడదా? ప్రస్తుతం ఏమీ హామీ లేక పోయినందువల్ల అపనమ్మకం పెట్టుకోవాలా? తరవాత అణా పైసలుతో సహా అసలు వృద్ధులు తీర్చి వేయనూ? వ్యక్తి గౌరవం మీద శంకరశాస్తుల్లుకి అంతపాటి నమ్మకం ఉంటే మరింక కావలసిందేమిటి?— నాకు పెళ్ళి అయి, పెళ్ళాం పిల్లలూ ఉంటేమాత్రం

మించి పోయిందేమిటి? తాను నన్ను పెంచుకోరాదూ? ఎవణ్ణో కళ్ళు తెరవని పసి కూనను పెంచుకొని వాడికి చదువు చెప్పించితే, ఒకప్పుడు ఆ దత్త పుత్త్రుడుకి చదువబ్బక పోవచ్చును. నేను ఇప్పుడే గ్రాడ్యు ఏటుని—ఆ తరవాత వాడికి పెళ్ళి చేసి, తీరాచేస్తే దంపతుల మధ్య ప్రేమానురాగాలు లోపించవచ్చును. పోనీ, దంపతులు సానురాగంగానే ఉన్నా వాళ్ళకు పిల్లలు కలగక పోవచ్చును. ఇంత పెంచుకొన్న ప్రయోజనమూ నశిస్తుంది. వంశం నిలబడకపోతే వాళ్లూ మళ్ళీ దత్తత చేసుకొని, ఇన్ని పాట్లూపడాలి. అటువంటి చిక్కు లేవీ కలక్కుండా నన్నే దత్తత చేసుకొంటే—గిరీశం చెప్పాడే, పెళ్లి మీద పెళ్లి, పెళ్లి మీద పెళ్లి చొప్పున బాల్యవివాహాలూ చేసి చివరికి నావంటి ప్రయోజకుడికిచ్చి పెళ్లి చేస్తే, అని, ఆవిధంగా ఉండదూ? ఉండకేం, మహారాజులా ఉంటుంది. కాని, ఈ బుద్ధి నాకూ మీకూ కలిగి ఏంలాభం? ఆశంకర శాస్త్రుల్లుకి కలగాలి గాని,...అలాఅలా విభజించుకొని పోతే నా ఈర్ష్య ఇన్ని చిలవలూ పలవలూ వేసింది.

ఇదంతా వెనక ఎప్పుడో శాస్త్రుల్లుగారిని గూర్చి సరిగా తెలియనప్పటి సంగతి. ఇప్పుడుమాత్రం నాకు ఆయనను తలచుకొంటే ఈర్ష్య కలగదు గాని, అదోకమాదిరి జాలితో కూడిన ఉపేక్షాభావం కలుగుతుంది. లేదు నీలో ఇంకా అంతర్వాహినిగా అప్పటి ఈర్ష్యాభావమే ఉంది; దానికి కొత్తరంగు పూస్తున్నావు అంటే మరి చెప్పలేను గాని, నా దృష్టిలో కలిగిన మార్పుకు కారణాలు తెలియజేసుకొంటున్నాను.

ఆయన అటూఇటూ పూర్తికాని, చదువుతో, ఎలాగో అతికష్టంమీద గవర్నమెంటులో పాతిక రూపాయిల జీతంమీద గుమాస్తాగిరీ సంపాదించాడు. లంచాలు పుచ్చుకోకపోవడమూ, యధార్థంగా ముక్కుకు సూటిగా పోవడమూ కారణంగా మాత్రమే ఉద్యోగంపోయిందట. తాను స్వయంగా లంచాలు పుచ్చుకోలేనివాడు తనపై అధికారులకు సదుపాయాలూ మామూళ్లు ఏం చూడగలడు? కొత్త సంసారం, అందులో ఇంటియజమానికి ఉద్యోగం లేని సంసారం, అందులో ఒక చిన్న పిల్ల—ఆ పిల్ల ఉద్యోగం ఉన్న కొద్ది సంవత్సరాలు అతిగా ముజరిపేడు... అటువంటి రోజుల్లో ఉద్యోగం పోవడంతో, మనిషికి ఒక వెఱ్ఱి పట్టుదల వచ్చింది. ఎంత దూరమయినా సంభావనలకూ సంతర్పణలకూ హాజరయేడు. కోమట్లకు లెక్కలు సరిచూసి పెట్టేవాడు. దస్తావేజులు రాసేవాడు; జాతకాలు చూసేవాడు స్వయంగా తనకు విశేషం నమ్మకం లేకపోయినాను. ఇలా, ఒకటేమిటి, రాత్రిం దివములు అలా ఏదో పని చేస్తూనే ఉండేవాడు.

ఆయన భార్యకూడా అన్నివిధాలా కలిసి వచ్చిన మనిషే. ఆవిడ పొందిక జగత్ప్రసిద్ధి చెందినది. ఆ పొందికని వేరే మాటల్లో చెప్పాలంటే, కేవలం ప్రాణం నిలబడి ఉండడానికి తగిన కనీసపు ఆహారాన్ని మాత్రమే తీసుకొంటూ, చిరుగులుకుట్టిన కుట్లే తప్ప బట్ట కనబడనంత వరకూ ఉపయోగిస్తూ, ఏ యితరఖర్చూ పెట్టకుండా నిద్రపోయిన కొద్ది గంటలు మినహా ఏదో తృణమో కణమో కలిసివచ్చే పని చేస్తూ ఉండడం...ఆయన కేవలం చెంబు పట్టుకొని, యాయహారానికి వెళ్ల లేదు: ఆవిడ ఇంత జీతానికీ అని వంట లక్కగా నిర్ణయంగా ఎక్కడా కుదురుకో లేదు. అంతేగాని, ఇద్దరూ అంత పనీ చేసేవారు.

ఏటేటా ఫలసాయం సరిగారాని భూమిని అమ్మగావచ్చిన కొద్దిపాటి మూలధనంతో వడ్డీవ్యాపారం ఆరంభించాడు. వందా యేభైయే కాదు. ఒకటీ రెండూ అయిదూ పదీ వడ్డీకిచ్చేవాడు. ఇవ్వడమయితే, ఎంత శకీమని ఇచ్చేవాడో, వసూలు చెయ్యడంలోనూ అంత కట్టుదిట్టంగా ఉండేవాడు. అందరూ అతన్ని శాపనార్థాలు పెట్టేవాళ్లే. 'అప్పుడేదో తెలియక బుద్ధి గడ్డితిని పుచ్చుకొన్నాం, ఇక మరెప్పుడూ ప్రాణంపోయినా అతనిదగ్గర అప్పు తీసుకొని రాకూడదనుకొనేవాళ్ళే. కాని మళ్ళీ అవసరం కలిగి అతని దగ్గరకి వెళ్లినప్పుడు అతను పాత సంగతులన్నీ మరిచిపోయి ఉంటాడనే తమను తాము నమ్మించుకొనే వారు; అతనూ నిజంగానే మరిచిపోయినట్లే ఉండేవాడు. వాళ్లిష్టం ఏమాట అనుకోనీ, మాటలేం మనమీదపడి కొట్టేయా? మనడబ్బు మనకి ప్రధానం! ఇదీ అతని తత్వం.

భార్యకి జబ్బుచేసినప్పుడు ఆయన డబ్బిచ్చి వైద్యం చేయిస్తాననే అన్నాడు. ఆమెమాత్రం ఉచితంగా వచ్చే మందుతప్ప, తనకు వంటిమీద స్పృహ

ఉన్నంతవరకూ ఒకదమ్మిడీ అయినా ఖర్చుపెట్టనియ్య లేదు. ఆమె పోయిన తరవాత, అప్పటికే పన్నెండేళ్ల పిల్ల కూతురికి పెళ్లి చేసేడు. తరవాత నాలుగయిదేళ్ళలో దురదృష్ట వశాత్తు, ఆమెకు వైధవ్యం ప్రాప్తిస్తే అదంతా శంకరశాస్త్రుల్లు ముసలివాడికిచ్చి పెళ్లిచేసిన కక్కుర్తి ఫలితమే అంటారు కొందరు. అయినా వాళ్లకి అసలు విషయమేమిటో కావలిస్తే కదూ, తనంటే కిట్టక ఏదో అలా అంటారంతే.

కూతురు తిరిగి వచ్చిన తరవాత ఒక ఏడాది పాటు బాగానే ఉంది తన స్థితికి తగినట్టుగా. తరవాత కాశీయాత్రకి వెళ్తానంది. ఒక వారంరోజులు పాటు ఆలోచించి, ఇక దానికి ఐహిక జీవితంలో మరేమీ అవలంబనం లేదు; ఎప్పటి కయినా ఆముష్మికం చూసుకోవలసినదే కదా అని, డబ్బిచ్చి తగిన పెద్దవాళ్లతో కలిపి పంపాడు. ఆ వెళ్లడం కూతురు ఎవడితోనో లేచిపోయిందనీ, యాత్ర అన్నది కేవలం ఒక మిష అనీ, తెలిసింది. 'సరే, దాని మొగుడితోపాటు అదీ పోయిందనేసు కొంటా' నన్నాడు శంకరశాస్త్రుల్లు.

ఇప్పుడు బాగా పెద్దవాడయి పోవడంచేత, ఎక్కడికీ కదలలేడు. ఎప్పుడూ ఇంట్లోనే ఉంటాడు, ఉంటాడంటే ఊరికే గోళ్లు గిల్లుకొంటూ కూర్చుంటాడా? పెరట్లో అన్నిరకాల కాయగూరలూ పండిస్తాడు. తనకు ఎక్కువయినది అమ్మేస్తాడు, ఓపికగా బియ్యపుగింజలు ఒక్కొక్కటే ఏరుకొని, వండుకొని, భోంచేస్తాడు, ఒక్కపూటే. రెండవ పూట ఏదో ఒక పండుతిని కొద్దిగా మజ్జిగ తాగుతాడంతే.

ఇప్పుడు మునపటి ఆ వసూలు చేసుకొనే ఓపికా, జ్ఞాపకశక్తీ తగ్గిపోవడంవల్ల, కేవలం బంగారం వెండి వస్తువులమీద తప్ప డబ్బు ఇవ్వడం మానుకొన్నాడు. అతని దగ్గర డబ్బు తీసుకొని వెళ్ళిన ప్రతివాళ్ళూ అంటూ ఉంటారు. "ఇంత ముసలివాడయేడు. నా అన్నవాళ్లెవరూ లేరుకదా ఎందుకంత డబ్బు కక్కుర్తి చెప్మా?" అని. కాని, ఆ కక్కుర్తివల్లనే, తమకు ఆమాత్రం అప్పు ఇయ్యగలపాటి డబ్బు చేరిందనీ, అతడు అందరిలాగే సామాన్యమయిన జీవితం గడిపి ఉంటే, అందరికంటే దరిద్రుడుగానే ఉండునని గ్రహించరు.

అతని జీవిత వివరాలు తెలుసుకొన్న తరవాత అతన్ని చూసి ఎలా ఈర్ష్యపడడం? మళ్లీ నా జీవితమంతా మొదటనుండీ బ్రతకడానికి సావకాశం ఉన్నా, అతని జీవితం వంటిది ముమ్మాటికీ నాకక్కరలేదు. నాకేకాదు, చాలామందికి అలాగే ఉంటుందనుకొంటాను.

అడవిలో పట్టిన తేనెపట్టు ఎవరికీ లభ్యంకాకుండా పోతున్నదే అనుకొంటే ఎంత ఫలితమో, అతని డబ్బు ఎవరికీ కాకుండా పోతున్నదే అనుకొన్నా అంతే ఫలితం. అయితే తేనె పట్టులోని తేనెను సమకూర్చడానికి తేనెటీగలన్నీ కలిసి పడ్డకంటే ఎక్కువే కష్టపడ్డాడుగాని తక్కువ పడలేదు దానిని సంపాదించడానికి. అటువంటి శంకరశాస్త్రుల్లును చూసి ఈర్ష్యపడడం దేనికి? ఇంతకీ అతని ఆస్తంతా మహాఉంటే ఒకటిన్నర లక్షలు. ఆ మాత్రం మొత్తాన్ని అవలీలగా ఏమీ లక్ష్యంలేకుండా ఖర్చుపెట్టే శ్రీమంతులున్న మన వ్యావహారిక జగత్తులో అతన్ని గురించి అంతగా అనుకోడం ధర్మంకాదు కాని, భూగర్భంలో నిక్షిప్తమయి ఉన్న అమూల్యమయిన ఖనిజాల గురించి కలగని ఆలోచన తేనెపట్టును చూసే సరికల్లా కలుగుతుంది ఎలా దీన్ని సంపాదించడమా? దీనిలో ఏ మాత్రం తేనె ఉంటుందా? అని.

లోకులు, నాతోపాటు ఎవరేమనుకొన్నా సరే శంకరశాస్త్రుల్లుగారు మాత్రం సంకల్ప సిద్ధుడు. ఆ తృప్తే లేకపోతే ఆయన ఇన్నాళ్ళు బ్రతకనే లేకపోయేవాడు.